

# ప్రణవమూర్తి

చీమ చిటుక్కుమంటే కళ్ళటు తిప్పి చూస్తాడు శంకరప్ప. కొమ్మల ఆకులు గలగల్లాడితే అటు ముఖమై పోతాడు. చిలకలు ముక్కులు పొడుచుకుంటూ కిచ కిచ లాడుతుంటే కళ్ళింత చేసుకు చూస్తాడు. గాలి గోపురం పావురాళ్ళు 'కూఊ' 'కూఊ' అంటూ గొంతుబిగబట్టి అరుస్తూ రెక్క లార్పుకుంటుంటే పరవశంతో చప్పట్లు చరుస్తాడు. కృష్ణమ్మ బుడగలు పేర్చుకుంటూ, రాళ్ళని చుట్టుకొంటూ గల గల పారుతుంటే రాత్రింబగళ్ళు అక్కడే గడిపేస్తాడు. ఎక్కడ ఎలాంటి శబ్దమైనా పొంగిపోయి పరుగెత్తుతాడు. పదిహేనేళ్ళ శంకరప్పకి శబ్దమంటే ప్రాణం. ఆ ప్రాణమైన శబ్దాన్ని అతనిగొంతు పలికించలేదు. అతడు

పుట్టు మూగ.

"వూ ఊ .....ఊ ..... ఊ ........ నాకు బొంగరం కొని పెట్టు."

ఐదేళ్ళపిల్ల మారాం చేస్తూ గోముగా తల్లి నడుగుతోంది.

తల్లి ఏదో చెప్తోంది. పిల్ల వినకుండా "వూ ఊ ...... ఊ ..... ఊ" మారాం చేస్తోనే ఉంది. ఆ మారం చేస్తున్న పిల్లగొంతు ఎంత హాయిగాఉందో శంకరప్పకి. తల్లి బొంగరానికి త్వరగా డబ్బు యిచ్చేస్తుందేమో, మరి కొంచెం సేపు ఆ పిల్ల తల్లి వొళ్ళో దూరి మారాం చేస్తే ఎంతబావుండును అనుకున్నాడు శంకరప్ప.

కృష్ణ వొడ్డుకెళ్తాడు. అక్కడ ఆడవాళ్ళు బట్టలుతుకుతూ యెడంచేసిన రెండు పాదాల మధ్య టాప్‌ని చీర బాదుతూ ' ఆ హుష్' అంటున్నారు. మళ్ళీ 'టాప్ .. ఆ హుష్' టాప్ ఆ హుష్' శబ్దం వింటూ అక్కడే వుండిపోతాడు. ఆ పైన చాకళ్ళ దగ్గర కొస్తే వాళ్ళు బట్ట బండమీదబాదుతూ "ష్ ష్" అని ఈల వేస్తున్నారు. "టాప్...... ష్ ...... టాప్ ...... ష్" తాళానికి తగ్గట్టు ఆ శబ్దం వింటూ అన్నం మరిచిపోతాడు.

ఎక్కడో సన్నాయి మోగింది. రయ్యిమని వీధిలోకి పరుగెత్తాడు. సన్నాయి వాద్యం మెలికలు మెలికలుగా గాలిలో కలిసిపోతోంది. ఆ సన్నాయి మూతి దగ్గర చెవిపెట్టి నుంచున్నాడు శంకరప్ప. ఆ నాదం చెవులారా వింటుంటే అతనికి లోపల శంఖాలు మోగుతున్నటుంది. 'ఖఁయ్' అని సన్నాయి పై స్వరం అందుకుంటే మనసు ఆకాశాన్ని తాకుతున్నట్టుంది. డోలు వరసలు వాయిస్తుంటే శరీరమంతా లయానుగుణంగా వూగిపోతోంది. అయ్యో! అంత నాదస్వరం నాలో పలక్కపోయినా అంత డోలు లయ నాలో విన్పించకపోయినా, ఆ చిన్ని తాళంలాంటి చప్పుడైనా నేను చేయలేక పోతున్నానే అని కుమిలిపోయేడు శంకరప్ప.

సాయంవేళ పరుగు పరుగున గుళ్ళో కొచ్చాడు. చిలకలా "కూ" అన్నాడు. శబ్దం రాలేదు.. పావురాయిలా "కువ్వూ" అన్నాడు. శబ్దం లేదు. "ఆహుష్" అన్నాడు లేదు. "ష్" అని ఈలవేశాడు. లేదు. ఏడుపొచ్చింది. జమ్మిఆకులు

గాలికి జలజల మోగాయి.మీరెంత పుణ్యం చేసుకున్నారు అనుకుని కళ్ళు తుడుచుకున్నాడు. వెన్నెట్లో జమ్మిఆకుల మోతలు, కొమ్మ కొమ్మ గాలికి "కిర్" మని రాసుకోటాలు ఆనందంగా వింటూన్నాడు. ఎక్కడో గుడ్లగూబ ఘూంకరింపు కూడా అతనికి ఆనందంగానే ఉంది.

కొన్ని శబ్దాలు విన్నప్పుడు చిరకాల స్నేహితుడు పలకరించినట్లుంటుంది. కొన్ని శబ్దాలు గిలిగింతలు పెడ్తాయి. కొన్ని శబ్దాలు హాయిగా నవ్విస్తాయి. కొన్ని శబ్దాలు లోపలున్న దుఃఖాన్ని భళ్ళు భళ్ళున బయటకు లాగుతాయి. కొన్ని శబ్దాలు భయంతో శరీరాన్ని వూపేస్తాయి. శంకరప్పకు అలాక్కాదు. అన్ని శబ్దాల్నీ అతని శరీరం ఆహ్వానిస్తుంది. అన్ని శబ్దాల్నీ అతని మనస్సు లయం చేసుకుంటోంది.

శివరాత్రినాడు శంకరప్పని చూడాలి. అంతటా అతనే. చెక్క భజన దగ్గర అతనే. గుర్రం ఆట దగ్గర అతనే ..... నామసంకీర్తనం దగ్గర అతనే ..... కొబ్బరి కాయలు పెతేలుమనే శబ్దం దగ్గర అతనే. మంత్ర పుష్పాల దగ్గర అతనే .... హర హర మహాదేవ అని ఆకాశాన్నంటే కేకల దగ్గర అతనే .... శంఖాలు, గంటలు, తప్పెట్లు, తాళాలు .... రండోళ్ళు..... డోళ్ళు ..... అన్ని శబ్దాల్ని అంతరంగంలో దాచుకుంటూ ఉన్మాదిలా తిరిగాడు శంకరప్ప.

అన్నినాదాల్ని అన్ని శబ్దాల్ని తనలో నింపుకుని తనూ పలకాలని, తనూ ఈ శబ్ద సముద్రంలో ఓ బిందువవ్వాలని మారేడుచెట్టు కింద కూర్చుని గొంతు పెగలించుకుంటున్నాడు. రాత్రయింది. గొంతునించి శబ్దం లేదు. నరాలు గింజుకుంటున్నాయి. గుండె కదిలిపోతోంది. శరీరం వణికి పోతోంది. చెమటలు పడ్తున్నాయి. కళ్ళు ధారలవుతున్నాయి. రక్తం మరిగిపోతోంది. శబ్దం ..... శబ్దం ..... రావాలి ..... పలకాలి ......

ఎట్టకేలకు శంకరప్ప గొంతు పలికింది. నరాలు విదిల్చికొని, గుండె తలుపులు పగలగొట్టుకొని, శరీర సంధులు చీల్చుకుని ఒకే ఒక శబ్దం వచ్చింది.

"ఓం ..... ం ...... ం. .....ఓం ...... ం ....... ం ." సర్వ శబ్దాలకు సర్వనాదాలకు ఆదియైన అంత్యమైన 'ఓం ..... ం ...... ❊